క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీలోని గౌరీదేవి ఆలయంలో రెండు వారాలుగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను గౌరీ సేవా సంఘం ప్రతినిధులు ఘనంగా జరుపుతున్నారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం ఆలయం వద్ద బతుకమ్మ పండగ నిర్వహించారు. సుమారు 50 మంది మహిళలు తమ తలపై నీటితో బిందెలను పెట్టుకుని బతుకమ్మ పాట పాడుతూ నృత్యాలు చేశారు. గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు జరిపారు. వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి శరగడం పత్నిరావు, మాజీ కార్పొరేటర్ పిల్లా కన్నబాబు, గౌరీ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అనాథలకు ఉపాధి చూపడం అభినందనీయం



టిఫిన్ బండిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందిన అనాథలకు ఉపాధి కల్పించేలా శ్రద్ధ తీసుకోవడం అభినందనీయని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. జీవీఎంసీ షెల్టర్‌లో శ్రీను, సుబ్బారావు అనే ఇరువురు వారి కుటుంబ సభ్యులతో గొడవపడి విశాఖ వచ్చి కంచరపాలెం సమీపంలో భిక్షాటన చేస్తూ ఉండేవారు. వీరికి జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆశ్రయం కల్పించారు. కొంత మొత్తాన్ని సమకూర్చి టిఫిన్ బండి నిర్వహించుకునేలా తగిన సహకారం అందించారు. టిఫిన్ బండిని ఆదివారం కార్పొరేటర్ ప్రారంభించి మమతను అభినందించారు.

పాన్ షాప్ దగ్ధం



చిన్న ములగాడలో దగ్ధమైన పాన్ షాప్

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు చిన్న ములగాడలో శనివారం అర్ధరాత్రి ఓ పాన్ షాప్ దగ్ధమైంది. గుర్తు తెలియని వ్యక్తులు ఈ చర్యలకు పాల్పడి ఉంటారని బాధితులు, స్థానికులు భావిస్తున్నారు. చిన్న ములగాడలో సూర్యనారాయణమ్మ అనే మహిళకు చెందిన పాన్ షాప్ నుంచి శనివారం అర్ధరాత్రి మంటలు చెలరేగడంతో షాప్ పాక్షికంగా దగ్ధమైంది. స్థానికులు స్పందించి మంటలను అదుపు చేశారు. గత వారం ఇదే ప్రాంతంలో ఓ పాన్ షాప్ అగ్నికి ఆహుతైంది. రెండు రోజుల కిందట ఇదే వార్డులో ఓ పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. తాజాగా మరో పాన్ షాప్ పాక్షికంగా కాలిపోయింది. వారం వ్యవధిలో మూడు సంఘటనలు ఒకే వార్డులో జరగడంపై పలువురు పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తులు ఇటువంటి ఘటనలకు పాల్పడి ఉంటారని అంటున్నారు. పోలీసులు నిఘా పెంచాలని కోరుతున్నారు.

విద్యార్థిని అదృశ్యం

మర్రిపాలెం: ఒక కళాశాల విద్యార్థిని అదృశ్యమైనట్టు కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కడజాల యశస్విని అనే విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి కంచరపాలెం ఇందిరానగర్-4లో నివసిస్తోంది. నగరంలోని ఒక కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఎప్పటిలానే ఈ నెల 21న కళాశాల నిమిత్తం వెళ్లి ఇంటికి రాలేదు. తెలిసిన వారిని విచారించినా ఫలితం లేకపోవడంతో విద్యార్థిని తండ్రి రమణ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఇది కదా అభివృద్ధి

నాడు:



కరాస శ్మశానవాటిక ప్రధాన ద్వారం

నేడు:



ఆకర్షణీయంగా కరాస హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటిక ప్రధాన ద్వారం

ప్రశాంతంగా ఆఖరి మజిలీ

పుట్టుకే కాదు.. చావు కూడా ఓ సంబరమే. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత సంప్రదాయాల మేరకు ఆఖరి మజిలీ వేడుకగా చేస్తారు. భవిష్యత్‌లో అంత్యక్రియలకు ఆరడుగల నేల కోసం వెతుక్కునే పరిస్థితులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. ఎన్‌ఏడీ కూడలి కరాసలో ఒకే చోట హిందూ, క్రిస్టియన్, ముస్లింల కోసమని శ్మశానవాటికలను ఏర్పాటు చేశారు. మత సామరస్యానికి ఇదో ప్రతీకగా నిలుస్తోంది. 52, 57, 90 వార్డుల పరిధిలోని పలు కాలనీల్లో చనిపోయిన వారి దహన సంస్కారాలు నిర్వహించేందుకు కరాస శ్మశానవాటికకు తీసుకొస్తారు. దీనిలో మౌలిక సౌకర్యాల కల్పనపై గత పాలకులెవ్వరూ పెద్దగా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత శ్మశానవాటికల అభివృద్ధికి సైతం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది.

- శ్మశానవాటికల అభివృద్ధికి ప్రాధాన్యం
- మతసామరస్యానికి ప్రతీకగా కరాస శ్మశానవాటిక
- రూ.1.98 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన
- దహన సంస్కారాలకు తగిన ఏర్పాట్లు
- డిప్యూటీ మేయర్ శ్రీధర్ చొరవతో సమకూరిన నిధులు

విశాఖ విద్య: కరాస హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటికల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలు పెంపొందించేలా రూ.1.98 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే రూ.60.98 లక్షల పనులు పూర్తయ్యాయి. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక చొరవ తీసుకొని, శ్మశానవాటిక అభివృద్ధి ఆవశ్యకతను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిధుల మంజూరుకు కృషి చేశారు. క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో ఆధునిక ప్రేయర్ హాల్, హిందూ శ్మశానవాటికలో మోడ్రన్ భర్నింగ్ ఫ్లాట్‌పాం, దాని వెనుక ఉన్న గెడ్డను అనుసంధానిస్తూ డ్రైన్స్, ప్రాంగణంలో గ్రీనరీ పెంపు వంటి పనులు చేపట్టేలా ప్రతిపాదనలు చేశారు. మతసామరస్యానికి ప్రతీకగా శ్మశానవాటికి ప్రవేశ మార్గంలో ఆర్చి నిర్మించనున్నారు. హిందూ, ముస్లిం శ్మశానవాటికల్లో ఒక్కో చోట రూ.15 లక్షలతో ఇప్పటికే వెయిటింగ్ హాల్స్ నిర్మాణం పూర్తి చేశారు.



శ్మశానవాటికలో తీర్చిదిద్దిన ప్రాంగణం



ముస్లిం శ్మశానవాటిలో నిర్మించిన వెయిటింగ్ హాల్

కరాస శ్మశానవాటికలో పూర్తయిన పనుల వివరాలు

హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు: రూ.19.90 లక్షలు

క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు: రూ.10.72 లక్షలు

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు: రూ.30.36 లక్షలు

ఇప్పటి వరకు ఖర్చు చేసిన మొత్తం నిధులు: రూ.60.98 లక్షలు



ముస్లిం శ్మశానవాటిలో నిర్మించిన వెయిటింగ్ హాల్

ఇన్నాళ్లకు సమస్యలు తీరాయి



కరాస శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ఎన్నో ఏళ్లుగా విన్నవిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఏ ఒక్కరూ ఈ సమస్యను పట్టించుకోలేదు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవటం వల్లే దీనికి మోక్షం కలిగింది. ఇన్నాళ్లకు సమస్యలన్నీ తీరుతుండటంపై ఎంతో సంతోషంగా ఉంది.

– నగిరెడ్డి రమణారెడ్డి, కరాస


సౌకర్యాలు మెరుగుపడ్డాయి



క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో మౌలిక సౌకర్యాలు మెరుగుపడేలా పనులు చేస్తుండటం సంతోషం. దీనిని గౌరవంగా చూసుకుంటాం. ఇదే చోట ప్రార్థనలు కూడా చేస్తుంటాం. ఇంతటి ప్రాధాన్యం గల బరియల్ గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలని గతంలో అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరుగుతోంది.

– ఆంథోనీ, క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ నిర్వాహకుడు

శ్మశానవాటిక అభివృద్ధికి ప్రత్యేక చొరవ



అంత్యక్రియలను కూడా వేడుకగా జరుపుకోవటం హిందూ, ముస్లిం, క్రిస్టియన్లకు సంప్రదాయంగా వస్తోంది. అందుకనే కరాస శ్మశానవాటిక అభివృద్ధి ఆవశ్యకతను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. నిధులు మంజూరులో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ సైతం ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్, జీవీఎంసీ

రాజ్యాంగంపై అవగాహన అవసరం



మల్కాపురం గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న అతిథులు



గాజువాక డిపో వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విజయ్‌బాబు తదితరులు

మల్కాపురం: భారత రాజ్యాంగం ఎంతో విలువైనదని, దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీరాంమూర్తి అన్నారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ రచనలో అంబేడ్కర్ వహించిన పాత్రపై విద్యార్థులకు వివరించారు. రాజ్యాంగాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు భాగ్యలక్ష్మి, అనసూయాదేవి, రచయిత సత్తిరాజులు, న్యాయవాది విశ్వనాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

- గాజువాక ఆర్టీసీ డిపో వద్ద బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుడు విజయ్‌బాబు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. అక్కడి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఆయనతోపాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



ఈశ్వరమ్మను పరామర్శిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

విశాఖ విద్య: రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆదివారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరామర్శించారు. 52వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో నివసిస్తున్న నక్క ఈశ్వరమ్మ, ఆమె కుమార్తె(అంధురాలు) ఇటీవల ఆర్ అండ్ బీ జంక్షన్ సమీపంలోని హైవేపై గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టి వెళ్లిపోవడంతో గాయాలపాలయ్యారు. వీరి పరిస్థితిని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా.. తగిన వైద్యం అందించే ఏర్పాట్లు చేశారు. గాయపడిన ఇరువురుని మహారాణి పేట సాగర్ దుర్గా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయిస్తున్నారు. వీరి యోగక్షేమాలు తెలుసుకునే క్రమంలో డిప్యూటీ మేయర్ శ్రీధర్ ఆస్పత్రికి వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. అంధురాలైన అన్న కుమార్తెను దత్తత తీసుకొని పెంచుకుంటున్న ఈశ్వరమ్మకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని శ్రీధర్ భరోసా ఇచ్చారు. ప్రమాద కారకుడిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

కనుల పండువగా జ్వాలాతోరణ వేడుక



జ్వాలాతోరణం వేడకలో భక్తులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కూడలి 90వ వార్డు సీతారామరాజు నగర్‌లో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం రాత్రి జ్వాలా తోరణం వేడుకగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయంలో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్ కాలనీలోని శివాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రధానార్చకుల ఆధ్వర్యంలో జ్వాలాతోరణ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, భక్తులు

నేడు గరికిపాటి ప్రవచనాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపాన గల ప్రకాష్‌నగర్ స్ఫూర్తి క్లాక్ పాయింట్(పోర్ట్ స్థలం) వద్ద సోమవారం సాయంత్రం మహాసహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత గరికిపాటి నరసింహారావు ప్రవచన కార్యక్రమం జరగనుంది. స్థానిక స్ఫూర్తి టీమ్ ఆధ్వర్యంలో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రవచన కార్యక్రమం జరుగుతుందని, ఔత్సాహికులు తరలిరావాలని కోరారు.

'సన్నిధి గొల్ల' రాక నేడు

మల్కాపురం: తిరుమల తిరుపతి సన్నిధి గొల్ల కిశోర్ యాదవ్ సోమవారం ఉదయం 61వ వార్డు వెంకన్నపాలెం రానున్నారు. మురళీకృష్ణ యాదవ సంఘం ఆహ్వానం మేరకు ఆయన ముందుగా శ్రీకృష్ణుడిని దర్శించుకుంటారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి సన్నిధి గొల్ల కిశోర్ యాదవ్‌ను సత్కరించనున్నట్లు యాదవ సంఘం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పారిశ్రామిక ప్రాంత యాదవ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొనాలని కోరారు.

కులం పేరుతో దూషణపై ఫిర్యాదు

మర్రిపాలెం: కులం పేరుతో దూషించారని కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం జయప్రకాష్ నగర్‌లో టి.మౌనిక అనే వివాహిత తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నారు. గతంలో నగరంలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసినపుడు ఢిల్లీకి చెందిన అమిత్ కక్కర్‌ను 2021 జూలైలో ప్రేమ వివాహం చేసుకున్నారు. 2022 అక్టోబర్‌లో ఢిల్లీకి వెళ్లిపోయారు. అక్కడ అత్తమామలు, భర్త కలిసి కట్నం, ఆస్తి కోసం వేధించడం, కులం పేరుతో దూషించడం ప్రారంభించారు. ఈ వేధింపులు తాళలేక మౌనిక 2022 డిసెంబర్‌లో కంచరపాలెంలోని అమ్మ ఇంటికి వచ్చేసింది. భర్త నచ్చజెప్పడంతో డిసెంబర్‌లోనే మళ్లీ ఆమె ఢిల్లీ వెళ్లింది. మళ్లీ అందరూ వేధింపులకు దిగడంతో ఉద్యోగం నిమిత్తం విశాఖ వచ్చేశారు. ఆమె తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

రాధాకృష్ణుల మహోత్సవాలకు తరలిన భక్తులు



ఉత్సవాలకు తరలివెళ్తున్న మహిళలు, చిన్నారులు



మల్కాపురం కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు

మల్కాపురం: ఆర్కే బీచ్ రోడ్డులోని గోకుల్ పార్కు వద్ద ఆదివారం నిర్వహించిన రాధాకృష్ణుల మహోత్సవాల్లో పారిశ్రామిక ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, యువత పాల్గొన్నారు. స్థానిక యాదవ మహిళా సంఘం ప్రతినిధులు తోనంగి వెంకటరమణి యాదవ్, నీలాతి గుణవతి యాదవ్, ప్రసాదుల లలితకుమారి యాదవ్‌ల ఆధ్వర్యంలో 58, 59, 60, 61 వార్డుల నుంచి సుమారు 200 మంది మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి కోలాటమాడుతూ తరలివెళ్లారు. మల్కాపురం, కొత్తనక్కవానిపాలెం, వెంకన్నపాలెం, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి యువత మల్కాపురం మరడిమాంబ ఆలయం నుంచి ద్విచక్ర వాహనాలపై నగరం వైపు ర్యాలీగా వెళ్లారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలోని శ్రీకృష్ణుడి మందిరంలో భక్తులు గోపాలుడికి పాలు, పెరుగులతో అభిషేకాలు జరిపారు. కృష్ణుడి కీర్తనలు ఆలపించారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు



పూజలందుకున్న గౌరీపరమేశ్వరులు



బుర్రకథ ప్రదర్శకులకు సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

విశాఖ విద్య: ఎన్‌ఏడీ కూడలి గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వరుల మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు ఆదివారం గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై గౌరీపరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. విజయనగరం జామి మండల వాసులచే బుర్రకథ ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాదం అందజేశారు.

అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాలి

మురళీనగర్: నగరానికి చెందిన వెటరన్ అథ్లెటిక్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించాలని వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య ఆకాంక్షించారు. ఏపీ స్టేట్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మురళీనగర్ వాకర్స్ క్లబ్‌లో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఉండడం గర్వకారణమన్నారు. డిసెంబర్ 9, 10 తేదీల్లో ప్రకాశం జిల్లాలో నిర్వహించనున్న చాంపియన్‌షిప్‌లో పాల్గొనే క్రీడాకారులను అభినందించారు. వారికి బుచ్చయ్య, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి టీషర్ట్‌లను అందించారు.

చెస్ టోర్నీ విజేతలకు ట్రోఫీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మర్రిపాలెం: మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో రెండో రోజు ఫస్ట్ స్టేట్ ఓపెన్ రోలింగ్ చెస్ టోర్నమెంట్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఎంగ్రవ్ చెస్ అకాడమీ, శ్రీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ రంగల బాబూరావు పేరిట నిర్వహించిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. విశాఖకు చెందిన గొర్లె నయన ఫస్ట్ విన్నర్‌గా, ముమ్మన వెంకట రుత్విక్ సెకండ్ విన్నర్‌గా నిలిచినట్లు టోర్నీ నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ముఖ్య అతిథి 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో చెస్ అకాడమీ సభ్యులు కె.వి.వి.శర్మ, జ్వాలాముఖి, సురేష్, ఆర్.బాబూరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.